సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



సిండికేట్‌మయం..

నూజివీడు పురపాలక సంఘంలో అభివృద్ధి పనులను చేపట్టే విషయంలో కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యి దోపిడీ పర్వానికి తెరలేపారు.

IIలో ▸



భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు.

IIలో ▸



ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ

విజయవాడలో జరిగిన సాంస్కృతిక ఉత్సవంలో నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఆరు బహుమతులు సాధించారు.

IIలో ▸

సమ్మెకు సై!

పోరుబాట
- మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- వరుసగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని తీరు
- నవంబర్ 3 నుంచి సమ్మెకు మున్సిపల్ కార్మికుల నోటీసులు



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టనున్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందిందని విమర్శిస్తున్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్‌కు సమ్మె నోటీసును ఇప్పటికే అందజేశారు. 12వ పీఆర్సీ ప్రకటించి, 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, పదవి విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఔట్ సోర్సింగ్ విధానంలో విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేషన్, మున్సిపల్, నగర పంచాయతీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల బ్యాంకు ఖాతాలు బలవంతంగా యాక్సిస్ బ్యాంకుకు మార్చరాదని, కార్మికుల పదవీ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మున్సిపల్ కాలనీలో నిర్మించాలని డిమాండ్ చేశారు.



ఏలూరు కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు (ఫైల్)

సమ్మె నోటీసు అందజేత

రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 3 నుంచి సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ ఉద్యోగుల సంఘాల నాయకులు చెబుతున్నారు. దీనిలో భాగంగా అక్టోబరు 14న ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు జిల్లా నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చేనెల 3 నుంచి చేపట్టే సమ్మెలో ఉద్యోగ, కార్మిక సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది అంతా పాల్గొనాలి. యూనియన్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏలూరు కమిషనర్‌కు సమ్మె నోటీసును అందించాం.

– ఎ.అప్పలరాజు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఏలూరు

చిన్నచూపు తగదు



రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బందిపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలి. ఉద్యోగ, కార్మికులందరికీ గుర్తింపు కార్డులను అందజేయాలి.

– భజంత్రీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏలూరు

ఆప్కాస్‌ను కొనసాగించాలి



కాంట్రాక్ట్–ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులను ఆప్కాస్ విధానంలో కొనసాగించాలి. జీఓ నెం.12 ప్రకారం 2024 సంక్రాంతి పండగ బోనస్ రూ.వెయ్యిని పెండింగ్‌లో ఉన్న సిబ్బంది అందరికీ వెంటనే చెల్లించాలి. వాటర్‌వర్క్స్, వాటర్ సప్లయ్, వీధి లైట్లు, డ్రైనేజీ, అండర్ డ్రైనేజీ పనుల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ రక్షణ పరికరాలను అందించాలి.

– దొడ్డిగర్ల నాగబాబు, మున్సిపల్ కార్మికుడు, ఏలూరు కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల ప్రధాన డిమాండ్లు

- 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలి.
- బకాయిపడిన డీఏలను తక్షణం చెల్లించాలి.
- పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ పేమెంట్స్‌లో చెల్లించాలి.
- కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.
- సీనియర్స్ అందరికీ పదోన్నతులు ఇవ్వాలి.
- ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్‌లను రెగ్యులరైజ్ చేయాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ సిబ్బందికి నెలకి రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలి.
- ఎన్ఎంఆర్‌లకు హెచ్ఆర్ఏ, డీఏతో కలిపి ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి.
- పీహెచ్ డ్రైవర్లగా, ఫిట్టర్లుగా, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలి.
- ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎన్ఎంఆర్‌లతో కలుపుకుని బకాయి పడిన మూడేళ్ల యూనిఫాం, కుట్టుకూలీ, టవల్స్, పాదరక్షలు, కొబ్బరి నూనె, సబ్బులు ఇవ్వాలి.

3.4 టన్నుల గంజాయి ధ్వంసం



గంజాయి బస్తాలను పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీసులు దాడులు చేసి, వాహన తనిఖీల్లో పట్టుబడిన భారీ గంజాయి నిల్వలను పర్యావరణహిత విధానంలో ధ్వంసం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో గంజాయి ధ్వంసంపై శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో భారీ ఎత్తున పట్టుబడిన 3,403.753 కిలోల గంజాయిని ఆధునిక విధానంలో పర్యావరణానికి హాని లేకుండా ధ్వంసం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా కొంత కాలంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి నిల్వలను గుంటూరు జిల్లాలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ధ్వంసం చేయించామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో రెండేళ్లుగా 58 కేసులకు సంబంధించి 3.4 టన్నుల గంజాయిని పోలీసులు పట్టుకున్నారన్నారు. గంజాయితో పలు సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితుల నేపథ్యంలో గంజాయి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, డీసీఆర్‌బీ సీఐ హబీబ్ బాషా, సీఐలు జి.సత్యనారాయణ (ఏలూరు వన్‌టౌన్), సీహెచ్ రాజశేఖర్ (పెదవేగి), సీఐ వెంకటేశ్వరరావు (జీలుగుమిల్లి), రామకృష్ణ (కైకలూరు), ఎం.సుబ్బారావు (ఏలూరు మహిళా స్టేషన్), సీఐ క్రాంతికుమార్ (చింతలపూడి), ఎస్సైలు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ప్రత్యేక యాత్రా బస్సులు



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల్లో ఆదివారం నుంచి పంచారామ క్షేత్ర దర్శిని టూర్ ప్యాకేజీ ప్రారంభించామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఇంద్ర రూ.1,600, అల్ట్రా డీలక్స్ రూ.1,100, సూపర్ లగ్జరీ రూ.1,200లుగా చార్జీలు ఉంటాయన్నారు. కార్తీక మాసంలో భక్తులు ఒకేరోజు పంచారామాలు దర్శించుకునేలా బస్సు సర్వీసులు ఏర్పాటుచేశామన్నారు. అలాగే ఎక్కడి నుంచైనా 40 మంది భక్తులు ఉంటే అదనపు చార్జీలు లేకుండా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీశైలం స్పెషల్ సర్వీసులు, అయ్యప్ప భక్తుల కోసం శబరిమలైకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ప్రతి పౌర్ణమి రోజు అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శన సమయాలకు చేరువిధంగా అరుణాచల యాత్ర స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు.

నేడు సూపర్ జీఎస్టీ ముగింపు ఉత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో నెల రోజులపాటు నిర్వహించిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ముగింపు సభ ఆదివారం భారీ ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

పత్తి కేంద్రాలు తెరవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: ఖరీఫ్ సీజన్‌లోని పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు తెరవాలని, పత్తి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నిర్ణయించిన క్వింటాల్‌కు రూ.8,110 మద్దతు ధర రైతులకు దక్కే పరిస్థితి లేదన్నారు. పత్తి వ్యాపారులు రకరకాల పద్ధతుల్లో క్వింటాలుకు రూ.ఆరేడు వేలకు మించి ధర ఇవ్వకుండా రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే సీసీఐ కేంద్రాలు ప్రారంభించి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని, క్వింటాల్‌కు రూ.10,500 మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదు

నూజివీడు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పది మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయటాన్ని అందరూ వ్యతిరేకించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ శనివారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమించిన విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక కారణాల సాకుగా విద్య, వైద్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటం బాధ్యతా రాహిత్యమేనన్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ కంపెనీలకు అప్పగించడం ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లుపొడవటమేనని, సామాన్య ప్రజలకు వైద్యాన్ని దూరం చేయడమేనని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగంలోనే విద్య, వైద్యం కొనసాగాలని చంద్రబాబు ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు న్యాయపరంగా కూడా అడ్డుకుంటామని పేర్కొన్నారు.

కేఆర్‌పురం ఐటీడీఏకు అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న పీఓ రాములునాయక్

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ ఢిల్లీలో శనివారం ఉత్తమ ఐటీడీఏ అవార్డును అందుకున్నారు. ధాత్రి అభ జనభాగిదరీ అభియాన్ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబర్చినందుకు కేఆర్‌పురం ఐటీడీఏకు అవార్డు లభించినట్టు ఆయన చెప్పారు. ఆది కర్మయోగి జాతీయ సమావేశం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రాలు, జిల్లాలు, ఐటీడీఏలకు జాతీయ అవార్డులు ప్రదానం చేశారన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏకు అవార్డు లభించడం గర్వంగా ఉందన్నారు.

బాలికపై మేనమామ వేధింపులు

- తల్లితో కలిసి చితకబాదిన వైనం
- వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో ఘటన
- కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో బాలికకు చికిత్స



బాలిక కాలుపై గాయాలు

కైకలూరు: మేనమామ వేధించడంతో పాటు తల్లి, అమ్మమ్మ, తాత చిత్రహింసలకు గురిచేశారని 9వ తరగతికి చెందిన బాలిక బావురుమంది. నరకం నుంచి బయటపడ్డానని గాయాలను చూపించింది. కైకలూరు మండలం చటాకాయికి చెందిన బాలికపై వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు సమీప అగ్రహారంలో ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం ఆమెను తండ్రి కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చాడు. పోలీసులకు ఆమె వివరాలు వెల్లడించింది. బాధితురాలు, ఆమె తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. చటాకాయికి చెందిన జయమంగళ కుమార అభిమన్యుడుకి ఏలూరు మండలం శ్రీపర్రుకు చెందిన కామాక్షితో 2009లో వివాహమైంది. వీరికి 2012లో అమ్మాయి జన్మించింది. అనంతరం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి కుమార్తె తండ్రి వద్ద ఉంటోంది. కామాక్షి మరో వ్యక్తిని వివాహం చేసుకోగా.. అభిమన్యుడు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కుమార్తె (14) తండ్రి అభిమన్యుడు వద్దే ఉంటూ భుజబలపట్నం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది.

దసరా పండక్కి తీసుకెళ్లి.. తండ్రి లేని సమయంలో కామాక్షి, ఆమె తల్లి చటాకాయలో ఉంటున్న బాలిక వద్దకు వచ్చి దసరా పండగకు దుస్తులు కొంటామని ప్రత్తికోళ్లలంక, అక్కడ నుంచి కామాక్షి సోదరుడు ఉమాశంకర్, తల్లిదండ్రులు నాగులమ్మ, వెంకటరమణ ఉంటున్న కడప జిల్లా బద్వేలుకు తీసుకువెళ్లారు. బాలికను అక్కడే ఉండాలని బలవంతం చేయడంతో ఆమె నిరాకరించి తండ్రి వద్దకు వెళతానని చెప్పింది. దీంతో తన తల్లి కామాక్షి ఇష్టానుసారం తనను కొట్టిందని బాలిక వాపోయింది. మేనమామ ఉమాశంకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పక్కనే పడుకోవాలని అనే వాడని పోలీసుల వద్ద తెలిపింది. బద్వేలులో బాలిక పరిస్థితిని చూసిన ఓ వ్యక్తి తండ్రి అభిమన్యుడికి ఫోన్ చేయగా అక్కడికి వెళ్లి శుక్రవారం రాత్రి చటకాయికి తీసుకువచ్చారు. మేనమామ బాలికతో అసభ్యకంగా ప్రవర్తించాడా? లేదా అన్న విషయాన్ని బద్వేలు పోలీసులు విచారిస్తారని కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు తెలిపారు. బాలిక విషయంలో తల్లిదండ్రులకు విభేదాలు ఉన్నాయన్నారు. ఫిర్యాదును పోలీసుతో బద్వేలు పంపామని చెప్పారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్ కార్మికులు చేయాల్సిన పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని నిలిపివేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి అంగుళూరు జాన్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గతంలో కాంట్రాక్టర్ల ద్వారా మున్సిపల్ పనులు జరిగిన కాలంలో కార్మికులకు కష్టానికి తగిన వేతనాలు లేవని, పీఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలను సైతం పొందలేకపోయేవారమని ఆవేదన వ్యక్తం చేశారు. మరలా ఇదే విధానాన్ని ఏలూరులో ప్రవేశపెట్టడం అంటే కార్మికుల కడుపుకొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపడమే అన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం జీఓ తీసుకురాగా సీఐటీయూ ప్రతిఘటనతో నిలిపివేశారని.. మరలా అదే పద్ధతిని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని కార్మికులంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. ధర్నాకు జె.గోపి, ఎం.ఇస్సాకు, వైఎస్ కనకారావు, పి.రవికుమార్, ధనాల వెంకటరావు, బండి రాజు సామ్రాజ్యం, గంగాధర్‌రావు నాయకత్వం వహించారు.

బుట్టాయగూడెంలో కుండపోత

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో శనివారం కుండపోతగా భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6:30 గంటల సమయంలో మొదలైన వర్షం రాత్రి 8:30 వరకూ కొనసాగింది. ప్రతి శనివారం బుట్టాయగూడెంలో వారపు సంత నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాతే కూలి పనులకు వెళ్లిన వారు, పరిసర ప్రాంత ప్రజలు సంతకు వచ్చి కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. భారీవర్షంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చేనేత రంగాన్ని కాపాడాలి



చేనేత కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అంతరించిపోతున్న హస్తకళలు, చేనేత ఉత్పత్తుల పునరజ్జీవానికి క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో చేనేత, జౌళి శాఖ, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేనేతదారులు, కార్మికుల సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సి అవసరం ఉందన్నారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంస్థ సెక్రటరీ ఎస్.రంజనా మాట్లాడుతూ చేనేత రంగాన్ని, చేనేత కార్మికులను ఆదుకునేందుకు కౌన్సిల్ తరపున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం నైపుణ్యంతో చేనేత ఉత్పత్తులు తయారుచేస్తున్న చింతపర్రుకి చెందిన వీర గణపతి, వాసా భ్రమరాంబ, కె.వీరనరసన్నకు రూ.25 వేల నగదు బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించాలనే అలాగే చింతపర్రు, భగ్గేశ్వరం, రాయకుదురు, పాలకొల్లు, రామచంద్రపురం, దగ్గులూరు, భీమవరం, ఆచంట వేమవరం గ్రామాలకు చెందిన చేనేత కార్మికులను చేనేత కండువాతో కలెక్టర్ సన్మానించారు. జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎ.అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, క్రాఫ్ట్ కౌన్సిల్ వైస్ చైర్మన్ బి.సుజాత, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బాణసంచా.. ధరల మోత

- ధరలకు రెక్కలు
- 20 నుంచి 40 శాతం మేర పెరుగుదల
- వినియోగదారుల బెంబేలు
- ప్రతికూల వాతావరణంతో వ్యాపారుల్లో ఆందోళన



భీమవరం లూథరన్ హైస్కూల్ ఆవరణలో బాణసంచా దుకాణాలు

సాక్షి, భీమవరం: బాణసంచా ధరలకు రెక్కలొచ్చాయి. గతేడాదితో పోలిస్తే 20 నుంచి 40 శాతం మేర పెరిగి వినియోగదారులను బేజారెత్తిస్తున్నాయి. ముడి సరుకుల ధరల పెరుగుదల, స్థానికంగా తయారీ తగ్గిపోవడం ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ప్రతికూల వాతావరణం, ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలో వ్యాపారులు ఉన్నారు.

జిల్లాలో 500 వరకు దుకాణాలు

జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లులో బాణసంచా హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. శనివారం నాటికి 350 దుకాణాలకు పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారులు తాత్కాలిక లైసెన్సులు జారీచేశారు. మరో 150 వరకు దరఖాస్తులకు లైసెన్సులు ఇవ్వాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్లకు పైగా బాణసంచా వ్యాపారం జరుగుతుందని అంచనా. బొగ్గు, గంధకం, అల్యూమినియం, సూరేకారం, బేరియం నైట్రేట్ తదితర ముడి సరుకుల ధరలు పెరిగిపోగా, స్థానికంగా తయారీ తగ్గిపోగా, శివకాశీ, ఇతర ప్రాంతాల నుంచి బాణసంచా తెస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. అగ్గిపెట్టెలు, తారాజువ్వలు, మతాబులు, భూచక్రాలు, 1,000 వాలాలు తదితర వెరైటీలు, వాటి కంపెనీలను బట్టి 20 శాతం నుంచి 40 శాతం వరకు ధరలు పెరిగాయంటున్నారు. రూ.1,000 పెడితే సంచుడు బాణసంచా రావడం లేదని వినియోగదారులు అంటున్నారు.

ఈ ఏడాది భిన్నమైన పరిస్థితి : సాధారణంగా నవంబరు మొదటి రెండు వారాల్లో దీపావళి రావడం, అదే సమయానికి ఖరీఫ్ కోతలు, మాసూళ్ల ముమ్మరంగా ఉండేవి. రైతులు, వ్యవసాయ కూలీల వద్ద డబ్బులు ఉండటం, ఉద్యోగులకు జీతాలు రావడం వలన బాణసంచా అమ్మకాలు ఆశాజనకంగా ఉండేవి. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అక్టోబరు మూడో వారంలో దీపావళి రాగా, నవంబరులో కాని ఖరీఫ్ కోతలు ముమ్మరం కావు. మరోపక్క ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు పడుతున్నాయి. భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మిక వర్గాలకు సరిగా పనులు లేవు. ఆయా ప్రతికూల పరిస్థితులతో ఈ ఏడాది అమ్మకాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళనలో వ్యాపారులు ఉన్నారు.



ధరలు ఇలా.. (రూ.లలో)

బాణసంచా	గతేడాది	ఈ ఏడాది (సుమారు)
అగ్గిపెట్టెలు (10 బాక్స్‌లు)	550	750
కాకర పువ్వొత్తులు (10 బాక్స్‌లు)	600	750
విష్ణుచక్రాలు (10)	100	180
చిచ్చుబుడ్లు (డజను)	180	260
జువ్వ (100)	250	350
భూ చక్రాలు (10)	100	180
టపాకాయలు (25)	25	40
పేలుడు జువ్వ (100)	1,000	1,600
డిస్కో చిచ్చుబుడ్లు (12)	260	380

టపాసులు కొనలేకపోతున్నాం



బాణసంచా ధరలు చూస్తుంటే కొనలేని పరిస్థితి. గతంలో ఓ మాదిరిగా ఉన్న ధరలు ప్రస్తుతం బాగా పెరిగాయి. రూ.500 తీసుకెళ్తే ఏమీ రావడం లేదు. ప్రతిరకం ధరలు పెరిగాయి. ఇలా అయితే దీపావళి సందడి తగ్గుతుంది.

– ఎస్.శ్యామ్‌కుమార్, మొగల్లు

గతేడాది కంటే రేట్లు ఎక్కువ



గతేడాదితో పోలిస్తే దీపావళి టపాసుల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో సరదాగా జరుపుకునే దీపావళిని నిరాశగా జరుపుకోవాల్సి వస్తుంది. రేట్లు ఎక్కువగా ఉండటంతో కొనుగోలు చేయడానికి కూడా వెళ్లడం లేదు.

– బీరా రామ్, నూజివీడు

మధ్యతరగతికి భారం



టపాసులు ధరలతో మోతెక్కిస్తున్నాయి. కొనాలంటే చాలా ఇబ్బంది. పేద, మధ్యతరగతి వర్గాలకు ఇది భారం. అలాగే నిత్యావసరాలు, పూలు, పండ్ల ధరలు పెరిగాయి. పండగ అంతంతమాత్రంగానే జరుపుకోవాలి.

– అభినేష్, నూజివీడు

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



భక్తులతో కిక్కిరిసిన శ్రీవారి దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు. దాంతో ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, కల్యాణకట్ట తదితర విభాగాలు భక్తులతో కళకళలాడాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న కొత్త జంటలు, వారి బంధువులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పంచారామక్షేత్రంలో హుండీల ఆదాయం రూ.7,32 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసియున్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం నందు శనివారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 60 రోజులకుగాను రూ.7,32,195, విదేశీ డాలర్లు 3, అన్నదానం హుండీ ద్వారా రూ.7,936 ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో తనిఖీదారు వర్ధినీడి వెంకటేశ్వరరావు, కర్రి శ్రీను, ఎం. రఘునాథ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువ రేవులు శుభ్రం



శుభ్రం చేసిన వీరహనుమాన్ రోడ్డు ఎదురుగా రేవు

సాక్షి స్పందన

పాలకొల్లు సెంట్రల్: కాలువ రేవులను మునిసిపల్ అధికారులు శుభ్రం చేయించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు నెలరోజుల పాటు కాలువలో స్నానాలు ఆచరిస్తారు. అయితే కాలువ రేవులు అపరిశుభ్రంగా ఉండడంతో దీనిపై 'సాక్షి' శివశివా రేవులు ఇలా.. స్నానాలు ఎలా...? శీర్షికన శనివారం కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన మునిసిపల్ అధికారులు మూడు కాలువ రేవులను శుభ్రం చేయించారు. మట్టి చెత్తను తొలగించిన అనంతరం మెట్లును శుభ్రంగా కడిగించారు. రేవులను శుభ్రం చేయించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సిండికేట్‌మయం.. దోపిడీ పర్వం

- నూజివీడు మున్సిపాలిటీలో ఈ ప్రొక్యూర్‌మెంట్ అభాసుపాలు
- పలువురు కాంట్రాక్టర్లతో విత్‌డ్రాలు
- చోద్యం చూస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

నూజివీడు: నూజివీడు పురపాలక సంఘంలో అభివృద్ధి పనులను చేపట్టే విషయంలో కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యి దోపిడీ పర్వానికి తెరలేపారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసేందుకు గాను ప్రవేశపెట్టిన ఈ ప్రొక్యూర్‌మెంట్‌కు తూట్లు పొడుస్తూ అభివృద్ధి పనులను ఎవరెవరికి ఇవ్వాలనే విషయమై అధికార పార్టీ కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పంచుకున్నారు. తమ అనుమతి లేకుండా టెండర్లు వేసిన కాంట్రాక్టర్లతో బలవంతంగా లెటర్లు ఇప్పించి ఉపసంహరించుకునేలా చేశారు. ఈ వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

నూజివీడు పురపాలక సంఘం పరిధిలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి రూ.3 కోట్లతో మున్సిపాలిటీ ఇంజినీరింగ్ అధికారులు గత నెలలో 31 పనులు చేపట్టేందుకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యి ప్రజాధనాన్ని దోచుకుంటున్న నేపథ్యంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూసేందుకు గాను ప్రభుత్వాలు ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. దీనివల్ల రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఏ కాంట్రాక్టరైనా టెండర్లలో పాల్గొని టెండర్ వేయొచ్చు. అయినప్పటికీ నూజివీడులోని అధికార పార్టీ కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు కూర్చొని ఈ ప్రొక్యూర్‌మెంట్‌కు తూట్లు పొడుస్తూ



నూజివీడు పురపాలక సంఘ కార్యాలయం

వర్కులను పంచుకున్నారు. తమకు ఇష్టం లేని కాంట్రాక్టర్లు ఎవరైనా టెండర్లు వేసి ఉంటే వారిని నయానో భయానో బెదిరించి విత్‌డ్రా చేసుకునేటట్లు చేశారు. దీంతో ఏకపక్ష దోపిడీకి అధికార పార్టీ కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లు తెరతీశారు. కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొంటే ఎవరు తక్కువకి వేస్తారో వారికి వర్కులు ఇస్తారు. నూజివీడు మున్సిపాలిటీలో మాత్రం అలా ఉండదు. అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో వాళ్లు చెప్పిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించాలి.

టెండర్ల విత్ డ్రా

ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానం అమలవుతున్నప్పటికీ నూజివీడు మున్సిపాలిటీలో పంచుకున్నంత దారుణంగా ఇంకెక్కడా పంచుకోరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం 31 వర్కులకు రూ.3 కోట్లతో టెండర్లు పిలవగా అందులో 24 వర్కులకు సంబంధించి ఒకటి కంటే ఎక్కువ టెండర్లు వచ్చాయి. కొన్ని పనులకు అయితే ఐదు, నాలుగు, మూడు టెండర్లు సైతం వచ్చాయి. దీంతో అధికార పార్టీ నాయకులు కొందరు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లందరిని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కూర్చోబెట్టి తమకు నచ్చని కాంట్రాక్టర్ల చేత విత్‌డ్రా చేయించారు. విత్‌డ్రా చేసుకున్న కాంట్రాక్టర్లందరూ ప్రస్తుతం వర్కులు దక్కించుకున్న వారి కంటే తక్కువకు టెండర్లు వేసిన వారే. వారు విత్‌డ్రా చేసుకోకుండా ఉంటే ప్రజాధానం ఆదా అయ్యేది. టెక్నికల్ బిడ్ తెరిచేవరకు ఉన్నప్పటికీ ఫైనాన్షియల్ బిడ్ తెరిచే ముందు వారితో విత్‌డ్రా లెటర్లు తీసుకోవడం గమనార్హం.

కాంట్రాక్టర్లకు వత్తాసు పలకడం దారుణం

ఇంత దారుణంగా ప్రజాధానాన్ని దోచుకునేందుకు కాంట్రాక్టర్లు సిద్ధపడితే వారికి ఇంజినీరింగ్ విభాగం అధికారులు వత్తాసు పలకడం గమనార్హం. సిండికేట్ అయ్యారని కళ్లకు కట్టినట్లు కనబడుతుంటే టెండర్లను ఎలా ఆమోదించారని, దీని వెనుక ఉన్న ఆంతర్యమేమిటని రాజకీయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన అధికారులు సైతం కంచే చేను మేసిన విధంగా మిన్నకుండటం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజాధనం దోపిడీ కాకుండా అడ్డుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు.

జిల్లాలో శాస్త్రవేత్తల బృందం పర్యటన



వరిచేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ఉండి: వరిపంటలో వచ్చే తెగుళ్లు, నాణ్యమైన రకాల పరిశీలనకు శాస్త్రవేత్తల బృందం శనివారం జిల్లాలో పర్యటించింది. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కేవీకే నుంచి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు, డాక్టర్ పీ వినయ లక్ష్మి, ప్రాంతీయ వ్యవసాయ వరి పరిశోధనా స్థానం మార్టేరు నుంచి డాక్టర్ ఎం గిరాజారాణి, డాక్టర్ వీ భువనేశ్వరీ, డాక్టర్ పీవీ రమేష్‌బాబు బృందం జిల్లాలోని పెనుమంట్ర మండలం ఎస్ఐ పర్రు, పెంటపాడు మండలం జట్లపాలెం, ఉండి మండలం యండగండి తదితర ప్రాంతాల్లో పర్యటించి వరిసాగులో వచ్చే తెగుళ్లు, వాటిని తట్టుకునే రకాలపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐ పర్రులో గత వర్షాలకు వరిలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు వచ్చి వ్యాప్తి చెందినప్పటికీ దానికదే తగ్గుముఖం పట్టిందని అన్నారు. అయితే ఉధృతి ఎక్కువగా ఉన్న రైతులు ఎకరాకు 400 గ్రా.కాపర్ హైడ్రోజన్‌తో పాటు 200 గ్రా.ప్లాంటో మైసిన్‌ను పిచికారీ చేసుకుని నత్రజని ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. ఎంటీయు 1318, 1262, 1121 మొదలైన రకాలు వర్షాల్లో ఈనినప్పుడు మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున గింజరంగు మారకుండా మానిపండు రాకుండా ఉండటం కోసం చిరుపొట్ట నుంచి పిగులు పొట్ట దశలో ప్రోపికొనజోల్ అనే మందును ఎకరాకు 200 మి.లీ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నట్లు శాస్త్రవేత్తల బృందం తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేసిన అమ్మ ట్రస్ట్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అనాథ మృతదేహానికి అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు చేశారు. పట్టణంలోని ఏనుగులు మేడ ఎదురు రోడ్డులో పోలీసులు శనివారం ఒక అనాథ మృతదేహంను గుర్తించారు. అంత్యక్రియలకు ఎస్సై పృధ్వి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను సంప్రదించగా వారు ముందుకు వచ్చారు. స్థానిక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కానిస్టేబుల్ సురేష్, ట్రస్ట్ అధ్యక్షుడు అంబటి సాయితేజ, సభ్యులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉత్సవాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు: విజయవాడలో ఈనెల 17న నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీలోని కళల విభాగం విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆరు విభాగాల్లో బహుమతులు సాధించారు. వ్యక్తిగత విభాగంలో మృదంగంలో సీహెచ్ సుధా ప్రణీత్, బీ గాయత్రి ప్రథమ, ద్వితీయ స్థానాల్లోను, కూచిపూడి నృత్యంలో యూ డాలీ నాగమైత్రి తృతీయ స్థానంలో నిలిచారు. బృంద విభాగంలో జానపద వాద్య సమ్మేళనం విభాగంలో పీ కార్తీక్ బృందం ప్రథమ స్థానంలోను, బృందగానం విభాగంలో ఎం శేఖర్, ఎం అనూష బృందం ప్రథమ స్థానంలోను, లఘునాటికలో అంతిమ సంస్కారం అనే స్కిట్‌కు ఏపీఎన్ సాయితేజ బృందానికి ద్వితీయ స్థానం లభించింది. మొత్తం ఆరు విభాగాలలో కలిపి రూ.36 వేల నగదు బహుమతిని విజేతలు అందుకున్నారు. సంగీత విభాగం హెచ్‌ఓడీ జినగం చంద్రమౌళి ఆధ్వర్యంలో విజేతలను, ఈ ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులను, విభాగపు అధ్యాపకులు మంగళగిరి శ్రీధర్, బంకుపల్లి వెంకట విద్యాసాగర్‌లను డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ అభినందించారు.

మ్యాజిక్ స్టార్ బాషాకు మహానంది అవార్డు

జంగారెడ్డిగూడెం: మ్యాజిక్ స్టార్ బాషాకు అంతర్జాతీయ మహానంది అవార్డు లభించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలో త్యాగరాయ గానసభ మందిరంలో తెలుగు వెలుగు సాహితీవేదిక వారు నిర్వహించిన శ్రీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా అంతర్జాతీయ తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మ్యాజిక్ షో రంగంలో విశేష కృషి చేస్తున్న జంగారెడ్డిగూడెంకి చెందిన మ్యాజిక్ స్టార్‌కు బాషాకు అంతర్జాతీయ మహానంది జాతీయ పురస్కారం 2025ను బహూకరించారు. ఈ అవార్డును తెలుగు వెలుగు సాహితీ వేదిక ఛైర్మన్ పోలోజు రాజ్ కుమార్ చార్యులు, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, జ్యోతిష్య నిపుణులు వేములవాడ మదన్మోహన్ చారిల చేతుల మీదుగా అందజేశారు.

పురుగు మందు ఘాటుకు వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: పొలానికి పురుగుల మందు కొట్టి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి లక్ష్మణరావు (35కు) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మణరావు శనివారం పొలంలో పురుగుల మందు కొట్టి ఇంటికి రాగా... తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మణరావు శనివారం రాత్రి మృతిచెందాడు.

నూతన కార్మిక విధానానికి వ్యతిరేకంగా పోరాడాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రమ శక్తి పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన కార్మిక విధానాన్ని నిరసిస్తూ, రాష్ట్రంలో పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో నాయకులు రాష్ట్ర కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. పట్టణంలో రెండు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం స్థానిక సిపాయి పేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగాయి. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, జే.లలితమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఏఐటీయూసీ సమావేశాలలో 26 జిల్లాలకు చెందిన 47 మంది కార్మిక నేతలు, ప్రతినిధులు మాట్లాడారు. పనిని భారంగా మార్చడాన్ని నాయకులు తప్పు పట్టారు. నవంబర్ 26వ తేదీన దేశ వ్యాప్తంగా తలపెట్టిన నిరసన దినాన్ని రాష్ట్రంలో విజయవంతం చేస్తామని నాయకులు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ముట్టడించాలని వెల్లడించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతుండడంతో ఆయన స్థానంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఉన్న ఎస్.వెంకట సుబ్బయ్యను ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించారు.



ఏఐటీయూసీ సమావేశం

జిల్లా యువజన విభాగ కమిటీల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని యువజన విభాగ కమిటీల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. జిల్లా యూత్ వింగ్ కమిటీ ఉపాధ్యక్షులుగా గాదిరాజు రాజేష్ (ఉండి), గనాబత్తుల సందీప్ (నరసాపురం), జనరల్ సెక్రటరీలుగా దేవి రాజేష్‌కుమార్ (ఆచంట), బొర్రా లక్ష్మణరావు (ఉండి), పోతంశెట్టి మానేశరరెడ్డి (ఆచంట), పాము యోహాను (భీమవరం), ప్రగడ బాల సుబ్రహ్మణ్యం (తణుకు) నియమితులయ్యారు. సెక్రటరీలుగా ఓడూరి సతీష్ కుమార్ (పాలకొల్లు), చింతపల్లి నాగ శ్రీనివాస్ (పాలకొల్లు), జోగి నాగరాజు (ఉండి), కునుకు శ్రీనివాసరావు (ఆచంట), వీరవల్లి బాలకృష్ణ (నరసాపురం), దొంక దుర్గాప్రసాద్ (తణుకు), గాజుల దుర్గా ప్రసాద్ (భీమవరం) నియమితులయ్యారు. వీరితోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఉల్లంపర్తి జాన్ (పాలకొల్లు), సాలా శ్రీను (పాలకొల్లు), టి.రామాంజనేయులు (ఉండి), చిలకపాటి అబ్రహం (ఉండి), రొక్కల భాను (ఆచంట), కర్లతేజా నాగ శేషసాయి (తణుకు), కీర్తి కనకయ్య (ఆచంట), మైలాబత్తుల నాగరాజు (నరసాపురం), బొక్కా నరసింహస్వామి (నరసాపురం), ద్వారంపూడి సురేంద్రరెడ్డి (తణుకు), చింతపల్లి ఆనందకుమార్ (భీమవరం), కరాని కిషోర్ (నరసాపురం), పిడకల మోక్షానందకుమార్ (భీమవరం), బండి వెంకటేష్ (భీమవరం), పత్తుల టైసన్ (భీమవరం) నియమితులయ్యారు.

జిల్లా యువజన విభాగ కమిటీల్లో నియామకాలు

మేతల యాజమాన్యం ఆక్వాలో ప్రాముఖ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి: మేతల యాజమాన్య పద్ధతులే ఆక్వాలో అత్యత ప్రాముఖ్యమైనవని విజయవాడ సీఐఎఫ్ఏ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌రాథోడ్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆక్వాలో మేతల తయారీ, యాజమాన్య పద్ధతులపై ఎన్నార్పీ అగ్రహారం మత్స్యపరిశోధనా కేంద్రంలో మూడు రోజుల పాటు విద్యార్థులు, రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్తలు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆక్వాసాగులో నాణ్యమైన మేతలను సరైన మోతాదులో వినియోగిస్తేనే మంచి దిగుబడులను సాధించగలరని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ రొయ్యలు, చేపల లార్వాకు సమతుల్య ఆహారం రోగనిరోధకశక్తి, వేగవంతమైన వృద్ధి కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమాల్లో సైంటిఫిక్ స్టాఫ్ భీమేశ్వరరావు, ధీరజ్, శివకుమార్, షష్ఠి రిష పాల్గొన్నారు.

22న అండర్-14 క్రికెట్ క్రీడాకారుల సెలెక్షన్లు

భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో అండర్-14 బాలుర క్రికెట్ టీం సెలెక్షన్లు నిర్వహిస్తున్నట్లు త్రిసభ్య కమిటీ సభ్యుడు ఎస్కే షకీర్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఆసక్తి గల క్రీడాకారులు సెలక్షన్స్‌కు హాజరుకావాలని, 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ లోపు జన్మించినవారు అర్హులని హుస్సేన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: ప్రమాదవశాత్తూ గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై చక్రవర్తి శనివారం తెలిపారు. ఈనెల 12వ తేదీన పట్టణంలోని గునుపూడిలో నిర్వహించిన పెళ్లి విందులో కటికల సునీల్ కుమార్ (25) ప్రమాదవశాత్తూ వేడిగా ఉన్న సాంబారు గిన్నెలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సునీల్‌కుమార్ భార్య నీలిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చక్రవర్తి తెలిపారు.

క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఉద్యానవర్సిటీలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: స్వచ్ఛమైన గాలిని అందరూ ఆస్వాదించాలంటే కచ్చితంగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్యానవర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. క్లీన్ ఎయిర్ అంశం ఆధారంగా అక్టోబరు నెలలో పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. వాహన కాలుష్యాన్ని అరికట్టాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సోలార్ వినియోగం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, వర్సిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



తణుకులో ధన్వంతరి జయంతి వేడుకలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణ సంఘు నాయకులు

తణుకు అర్బన్: తణుకు పట్టణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ధన్వంతరి జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆతవ శ్రీను మాట్లాడుతూ మా కులదైవం అయినటువంటి శ్రీ ధనవంత్రి జయంతి వేడుక రాష్ట్రవ్యాప్తంగా నాయి బ్రాహ్మణులు పండుగలా జరుపుకుంటామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధన్వంతరి జయంతికి గుర్తింపునిస్తూ జీవోను జారీ చేసి మాకంటూ ఒక గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యదర్శి జామి శ్రీనివాస్, కోశాధికారి గాడిల్లి గోపాలం, ఉపాధ్యక్షుడు భీమవరపు శ్రీనివాస్, ఉప కార్యదర్శి కోడూరి శివదుర్గారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సానపల్లి ఋషి, గౌరవ అధ్యక్షుడు కొట్టపి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో స్వచ్ఛ భారత్



డిపో ఆవరణలో స్వచ్ఛ భారత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో, కాంప్లెక్స్ ఆవరణలో శనివారం డిపో మేనేజర్ పి.దానమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్త చెదారాలను తరలించారు. అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, ఎస్టీఐ కుమారి, యూనియన్ నాయకులు డిపో కార్యదర్శి చోడగిరి వెంకట రమణ, ఆకుల మనోహర్, నిరంజన్, ఆదినారాయణ, ఎంసీ రమణ, ఏడీసీ రామారావు, మాధవ రావు, వానపల్లి అప్పారావు, గ్యారేజ్ సిబ్బంది, డిపో సిబ్బంది, సెక్యూరిటీసిబ్బంది పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెంటపాడు: వరిపై ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మార్టేరు, ఉండి కేవీకేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు గిరిజారాణి, భువనేశ్వరి, రమేష్‌బాబులు పేర్కొన్నారు. శనివారం మండల వ్యవసాయాధికారి చీర్ల రవికుమార్ ఆధ్వర్యంలో జట్లపాలెం గ్రామంలో పలు పంట పొలాలను పరిశీలించారు. పలు వ్యవసాయ క్షేత్రాలలో తెగుళ్లు ఉన్నట్లు గుర్తించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ బాగ్యలక్ష్మి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సజ్జాపురంలో మినీ కంపోస్టు యార్డులు

- సర్వీసు రోడ్లపై పేరుకుంటున్న చెత్త
- వ్యర్థాలన్నీ రోడ్డుపై వేయడంతో కుంచించుకుపోతున్న రహదారి
- చెత్తతో కలుషితమవుతున్న గోస్తనీ కాలువ



తణుకు సజ్జాపురం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే సర్వీసు రోడ్డులో మినీ కంపోస్టు యార్డుగా మారిన వైనం



తణుకు సజ్జాపురం జాతీయ రహదారి గోస్తనీ కాలువపైన మినీ కంపోస్టు యార్డుగా మారిన దృశ్యం

తణుకు అర్బన్: జాగా కనపడితే చాలు మినీ కంపోస్టు యార్డుగా మారే పరిస్థితులు తణుకులో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తణుకు సజ్జాపురం పరిధిలోని జాతీయ రహదారిపైకి వెళ్లే సర్వీసు రోడ్లు చెత్తాచెదారాలకు కేంద్రంగా మారి మినీ కంపోస్టు యార్డులను తలపిస్తున్నాయి. చెత్త ఉంటే చాలు ఇక్కడ పారేయవచ్చనే సంకేతాలతో ఈ ప్రాంతం దుర్గంధానికి నిలయంగా మారింది. కొబ్బరి బొండాల వ్యాపారులు అధికశాతం ఈ రెండు సర్వీసు రోడ్లలోనే తాగేసిన బొండాలు పారవేస్తుండగా, ఎవరి ఇంట్లో చెత్తపేరుకున్నా ఇదే ప్రాంతానికి దూరం నుంచి వచ్చి మరీ చెత్త పారపోస్తుండడం నిత్యం కనిపిస్తోంది. అంతేకాకుండా ఇళ్ల నిర్మాణంలో వచ్చే వ్యర్థాలు సైతం సర్వీసు రోడ్డులో డంప్ చేయడంతో రోజురోజుకూ రహదారి సైతం కుచించుకుపోతుందని సజ్జాపురవాసులు ఆరోపిస్తున్నారు.

గోస్తనీ కాలువలోకి చెత్త...

గోస్తనీ కాలువపైభాగంలో చెత్త పారపోస్తుండడంతో ఆ చెత్త గాలికి ఎగిరి గోస్తనీ కాలువలోకి చేరుతున్న పరిస్థితులు ఈ ప్రాంతంలో నెలకొన్నాయి. ఒకప్పుడు గోస్తనీ నదిగా పిలువబడే ఈ కాలువలో పట్టణ పరిధిలో నివాసాల నుంచి వచ్చే వాడకం నీరంతా గోస్తనీ కాలువలోకి చేరి నీరు కలుషితంగా మారిన దుస్థితిలో ఉంది.. దీంతో గోస్తనీ కాలువలో స్నానాలు ఆచరించాలంటేనే భయపడే దుస్థితి భక్తులో నెలకొంది. ఇప్పుడు కొత్తగా చెత్త సైతం గోస్తనీ కాలువలోకి చేరుతుండడంతో గోస్తనీ కాలువ నేడు మురికికూపంగా తయారయ్యే విధంగా మారిందని ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు.

22 దీపావళి దుకాణాలు



దీపావళి దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతం

తాడేపల్లిగూడెం: దీపావళిని పురస్కరించుకొని నియోజకవర్గంలో 22 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు 22 మందికి అధికారులు మూడు రోజుల పాటు వ్యాపారం చేసుకొనేందుకు వీలుగా తాత్కాలిక లైసెన్సులు ఇచ్చారు. ఎస్వీ రంగారావు విగ్రహం సమీపంలో ఉన్న మునిసిపల్ రిజర్వు స్థలంలో పట్టణ పరిధిలో 17 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. పెంటపాడు ఎస్టీవీఎస్ హైస్కూల్‌లో నాలుగు దుకాణాలు, ప్రత్తిపాడులో ఒక దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. సేఫ్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి మురళీకొండబాబు చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. నీరు, ఇతర రక్షణ ఏర్పాట్లుపై తెలియచేశారు.

పేదలకు ఉచిత న్యాయ సలహా



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు ఉచిత న్యాయ సలహా, సహాయాన్ని అందిస్తామని తాడేపల్లిగూడెం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీలు పేర్కొన్నారు. న్యాయ సేవా సహాయ సేవా కేంద్రాలను గణపవరం గ్రామపంచాయతీ ఆఫీస్‌లో సీనియర్ జడ్జి కె.మాధవి, పెంటపాడు గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో ప్రిన్సిపల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీలు ఆధ్వర్యంలో ప్రారంభించారు. జడ్జిలు మాట్లాడుతూ ప్రతి శనివారం (2వ శనివారం మినహా) అందుబాటులో ఉన్న పారా లీగల్ వలంటీర్లు న్యాయపరమైన సమస్యలకు ఉచిత సలహాలు అందిస్తారని తెలిపారు. కోర్టువరకు రాకుండా ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు పని చేస్తాయని, ప్రజలు తమ తమ చిన్నచిన్న సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చునని వెల్లడించారు. లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు డీజేకే సాయికుమార్, జంపన రమేష్ రాజు, ఎస్వీ రామకృష్ణ, కేఎస్ఆర్‌వీ కేశవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, ఎం.శ్రీనుబాబు, లోకేష్, గణపవరం ఎండీఓ లక్ష్మి, సర్పంచ్ అలంకార్, ఎస్ఐ రమేష్, పెంటపాడు ఎంఆర్ఓ రాజ రాజేశ్వరీ, ఎండీఓ రాం ప్రసాద్, సీఐ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలు విద్యార్థి దశలోనే ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం మండలంలోని మోదుగ గుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడుతూ బాలబాలికల మధ్య తేడాలేకుండా ఇరువురిని సమానంగా చదివించాలన్నారు. చదువుతోనే సమానత్వం సాధ్యమన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఎం. శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది గంగారత్నం, నాగమణి, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే, ఎల్.అగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూలులో సూపర్‌వైజర్ ఎస్తేరురాణి, కృష్ణాయపాలెం, ఆరుగొలను జెడ్పీహెచ్‌లో సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను విద్యార్థులు, యువత తప్పక సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక ఈవీఎం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ పాఠశాల 8, 9, 10వ తరగతులకు చెందిన 52 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాలు నమోదు చేశారు. బుక్ రీడర్స్, రిసోర్స్‌పర్సన్స్, సభ్యులు జి.బాపయ్యశర్మ, జనార్ధనరావు, లక్ష్మణరావు, ఆంజనేయులు, జాన్‌బాబు, కేవీ సూర్యనారాయణ, హెచ్‌ఎం ఏవీ దుర్గ లక్ష్మి, లంక రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూల్ సమయంలో చక్కని చదువులు చదువుతూనే, మరింత జ్ఞానం, విజ్ఞానం కోసం, మంచి తెలివితేటలు కోసం తప్పక విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించాలని, మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పిల్లలు భవిష్యత్తు బంగారు బాట అవుతుందని వివరించారు.

తేతలి హైస్కూల్‌లో హరిత దీపావళి



తేతలి హైస్కూల్‌లో హరిత దీపావళిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హరిత దీపావళి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కె.పుల్లారెడ్డి మాట్లాడుతూ వెలుగుల పండుగను విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బంతిపూల రేకులతో, మట్టి ప్రమిదలతో దీపం ఆకారంలో అమర్చి హరిత దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గ్రీన్ కాకర్స్ కాల్చి, పొగ, శబ్దం లేని వెలుగుల పండుగగా దీపావళిని ముందుగానే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి, గ్రీన్ టీచర్స్ పి. గంగాభవాని, జి. దుర్గారావు, సిబ్బంది కార్యదర్శి జె.రాజకుమారి, ఉపాధ్యాయులు, జి.సుధారాణి, డీవీఎస్ మారుతి రామ్, ఎస్. రామకృష్ణ, పీడీ వెంకటేశ్వరరావు, పి.మాధవి లక్ష్మి, జి. స్వతంత్ర భారతి పాల్గొన్నారు.

డీజీపీ మరణానికి కారకులను శిక్షించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): హర్యానా అడిషనల్ డీజీపీ మరణానికి కారకులైన అక్కడ పోలీస్ ఉన్నతాధికారులను సస్పెండ్ చేసి, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసు నమోదు చేయాలని, వారిని తక్షణమే అరెస్టు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంగరాజు మాట్లాడుతూ ఎస్సీకులంలో పుట్టిన వై.పురన్ కుమార్ ఐపీఎస్ చదివారని, హర్యానా అడిషనల్ డీజీపీగా ఎదిగారని, ఆయన భార్య ఐఏఎస్ అధికారిణిగా ఉన్నారని, ఉన్నత స్థాయిలో ఉన్న వారిపై కుల వివక్ష చూపించడమే కాకుండా దేవాలయంలోకి రాకుండా చేశారని, అన్ని విధాలుగా మానసిక క్షోభకు గురి చేశారని, దీంతో సర్వీస్ గన్‌తో కాల్చుకోవడం బాధకరమన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. సీహెచ్ సుజన్, విజయ్ కుమార్, నాగరాజు, శీలి వెంకటేశ్వరరావు, రాఖీ, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

మహానాగు షూటింగ్ పూర్తి

పెంటపాడు: మండలం రాచర్ల గ్రామంలో జరుగుతున్న మహానాగు చిత్రం షూటింగ్ తొలి టాకీ పార్ట్ పూర్తైనట్లు చిత్ర డైరెక్టర్ ఉదయభాస్కర్, నిర్మాత తుమ్మల రామసత్యనారాయణలు తెలిపారు. తొలిటాకీ పార్ట్ పూర్తి చేసుకొన్న ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ కోసం శనివారం యూనిట్ సిబ్బంది హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. తరువాత షెడ్యూల్ సుమన్‌తో పాటు, హీరో, హీరోయిన్‌లతో హైదరాబాద్‌లో షూటింగ్ ఉంటుందన్నారు.

బాధితులకు పరామర్శ



కొండేపాడులో పాస్టర్ దంపతులను పరామర్శిస్తున్న వడ్డీ రఘురాం

పెంటపాడు: ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న, అనారోగ్యానికి గురైన పార్టీ నేతలను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం శనివారం పరామర్శించారు. కొండేపాడుకు చెందిన పాస్టర్ కొడమంచిలి ఏసురాజు దంపతులు ఇటీవల ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటుండగా, వల్లూరుపల్లిలో పార్టీ నాయకురాలు ఉందుర్తి ఝాన్సీ కిడ్నీ వ్యాధితో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వారిని రఘురాం పరామర్శించారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

పెనుగొండ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ ఎస్కేవీఆర్ బాలికోన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికలకు హక్కులు, వాటిని కాపాడేందుకు చట్టాలు, బాల్య వివాహాల నిరోధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి



ఇరగవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: గ్రామాల్లో పారిశుద్ధ్య సేకరణకు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి వి.నాగరాజరావు తెలిపారు. మండలంలోని ఇరగవరం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి పరిసరాల పరిశుభ్రత

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజానికి పరిసరాల పరిశుభ్రత అవసరమని పీ-4 తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రత్యేకాధికారి జీవీకే.మల్లిఖార్జునరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. తద్వారా గ్రామ ఆరోగ్యంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

తణుకు సబ్ జైలు సందర్శన



తణుకు సబ్ జైలులో ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.రత్నప్రసాద్

తణుకు అర్బన్: ఉమ్మడి గోదావరి జిల్లా న్యాయ సేవల సంస్థ సెక్రటరీ కె.రత్న ప్రసాద్ శనివారం తణుకు సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార వసతి, వైద్య సదుపాయాలపై జైలు సూపరింటెండెంట్ ఎ.మోహనరావును అడిగి తెలుసుకున్నారు. రిమాండ్ ముద్దాయిలు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే వారికి మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయ సేవలు అందిస్తారని చెప్పారు. వారానికి రెండు రోజులు ప్యానెల్ లాయర్, పారా లీగల్ వలంటీర్‌లు వచ్చి న్యాయ సలహాలు ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులతోపాటు ప్యానెల్ న్యాయవాదులు డి.కృష్ణ కుమారి, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

మానవతా సేవలు అభినందనీయం



పేద వృద్ధులకు సాయం అందజేస్తున్న మానవత

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థలు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం పేద వృద్ధ దంపతులకు పనిచేసుకోలేని స్థితిలో ఉండటం వల్ల ఆ కుటుంబానికి సుమారు రూ. 5 వేలు విలువైన నిత్యావసర వస్తువులు, బియ్యం బస్తా, వైద్య ఖర్చులు అందజేశారు. మానవత అధ్యక్షుడు జి.రాజేంద్రకుమార్, కోశాధికారి ఎర్ర ఆంజనేయులు, సెక్రటరీ మిరియాల కిషోర్, యెగ్గిన శరత్ బాబు, చేకూరి బంగార్రాజు, బురిడి సతీష్, పాండురంగారావు, బి.అరుణ, కేవీ చలం, మద్దు నాగేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, కర్రి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పెంటపాడు: దసరా శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలు సందర్భంగా పెంటపాడు 10 వార్డు ముసినాని వారి వీధిలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు శివాపు తులసీబాబు, సత్తిరెడ్డి, వీర్రెడ్డి, సుధా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వరహాలరెడ్డి, శీలం రాంబాబు, ముసినాని మల్లేశ్వరరావు, డాక్టర్ సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి తదితరులతో పాటు, అమ్మవారి ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన



ఇరగవరం పీహెచ్‌సీలో బాలింతతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి గీతాబాయి

ఇరగవరం: మండలంలోని ఇరగవరం పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారిణి డా.జి గీతాబాయి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్‌సీడీసీడీ సేవలు, పనితీరును పరిశీలించి తగు సూచనలు అందజేశారు. రోగుల పట్ల డాక్టర్ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవలు జరిగేలా చూడాలన్నారు. బాలింతలకు నవజాత శిశువులు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఖాన్ సాహెబ్, యుడీసీ శ్రీనివాస్, పీహెఎన్ఏ రాణీ, సూపర్‌వైజర్ మూర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.